క్లుప్తంగా

ఐక్యవేదిక ఆటో విభాగం ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ కడప నగరంలో ఆటో విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఈ సందర్భంగా కడప నగర ఆటో విభాగం అధ్యక్షులుగా బుద్ధాయపల్లెకు చెందిన ముద్దల కృష్ణయ్యను నియమించారు. అసెంబ్లీ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని, ప్రజా సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అవ్వారు మల్లికార్జున అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.పెంచలయ్య, పార్టీ పెయింటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీఆర్ శంకర్, పార్టీ నగర అధ్యక్షులు జయరాం, కమలాపురం అసెంబ్లీ అధ్యక్షులు ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

కడప వైఎస్సార్ సర్కిల్: ఈనెల 27, 28, 29, 30 నాలుగు రోజుల పాటు నంద్యాలలో డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణా తరగతులు జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, విరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శిక్షణా తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్, కో.కన్వీనర్ పెద్దన్న సభ్యులు భాస్కర్ రెడ్డి ,జగదీష్ పాల్గొన్నారు.

5న వేలం పాట

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని పుట్లంపల్లెలోగల శ్రీ పాలకొండ్రాయస్వామి దేవస్థానానికి సంబంధించి వాహనాల పార్కింగ్ రుసుము హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. శ్రావణమాసంలోని నాలుగు శనివారాలలో పాలకొండ క్షేత్రంలో వాహనాల పార్కింగ్ రుసుము హక్కు గురించి ఆగస్టు 5న ఉదయం 11 గంటలకు నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయశాఖ అధికారులు వేలం పాట నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 73963 54149 నెంబరులో సంప్రదించాలన్నారు.

వైవీయూలో జాబ్‌మేళా



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డితో కలిసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి మరిన్ని కంపెనీలను ఆహ్వానించి ఇక్కడి విద్యార్థులతోపాటు బయట వారికి కూడా ఉద్యోగ అవకాశాలు కలిప్పించనున్నామన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు ఆచార్య ఎల్.వి. రెడ్డి మాట్లాడారు. టీసీఎల్ డైరెక్టర్ శివకుమార్, అపోలో ఫార్మసీ కంపెనీ హెచ్ఆర్ శశికాంత్ కుమార్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 32 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : భవితా కేంద్రాల్లో ఉండే ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ఐఈఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పనా శైల పేర్కొన్నారు. బుధవారం కడప సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణంలో ఉండే భవితా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. భవిత కేంద్రంలో పిల్లలకు ఎలాంటి సేవలందుతున్నాయని ఆరా తీశారు. కొద్ది సేపు పిల్లలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఐసి కోఆర్డినేటర్ రమణమూర్తి, సెక్టోరియల్ అధికారులు విశ్వనాథరెడ్డి, ఐఈఆర్పీలు సిద్దారెడ్డి, విజయమ్మ పాల్గొన్నారు.

ఎస్టీయూ నాయకుల వినతి

కడప ఎడ్యుకేషన్ : కడప నగర పాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ కడప నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదిక్ అలీ, సంజీవ రాయుడు కోరారు. ఈ విషయమై బుధవారం కడప మండల విద్యాధికారి జి.గంగిరెడ్డిని కడప ఎమ్మార్సీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సత్యనారాయణ, ఫక్రుద్దీన్, రాజశేఖర్ నాయక్, నజీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు పుస్తకాలు అందజేత

వైవీయూ : భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు జీవితచరిత్రకు సంబంధించిన పుస్తకాలను ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి వైవీయూ, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలకు అందజేశారు. బుధవారం ఈ పుస్తకాలను వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా గ్రంథాలయాల బాధ్యులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డికి అందజేశారు.

రక్తదానంతో.. బతుకు ని(ను)వ్వు



అమ్మాయిలు ధైర్యంగా రక్తదానం చేయవచ్చు

రక్తదానం కేవలం పురుషులు మాత్రమే చేయాలన్న అపోహ ఉంటే తొలగించుకోండి. మహిళలు సైతం రక్తదానం చేయవచ్చు. నేను ఇప్పటి వరకు రెండుసార్లు రక్తదానం చేశాను. నేను రక్తదానం చేయడంతో పాటు పదిమందికి రక్తదానం చేయమని చెప్పి ప్రోత్సహిస్తున్నా. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం అన్న విషయాన్ని వివరిస్తున్నా.

– ఆకుల వసుంధర, ఎన్‌సీసీ కేడెట్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప



నా స్నేహితులకు రక్తదానం చేయాలని చెబుతున్నా

నేను మెడికల్ రెప్రజంటేటివ్‌గా పనిచేస్తున్నాను. జిల్లావ్యాప్తంగా తిరుగు తూ ఉంటాం. ఎవరైనా రక్తం అవసరం ఉందని సమాచారం ఇచ్చినా, కోరినా వెంటనే రక్తదానం చేసేందుకు ఏమా త్రం వెను కాడకుండా రక్తదానం చేస్తున్నాం. ఇలా ఇప్పటి వరకు 20సార్లు రక్తదానం చేశాను. నాతో పాటు నా చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువుల ను సైతం రక్తదానం చేసేలా చైతన్యం తీసుకువస్తున్నాం.

– కిరణ్‌కుమార్, మెడికల్ రెప్రజెంటేటివ్, కడప



అపోహలు వీడి రక్తదానం చేయాలి

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. అప్పుడే రక్తకొరతను నివారించవచ్చు. రక్తదానం పట్ల ఉన్న అపోహలు వీడి 18 సంవత్సరాలు పైబడిన వారందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. – డాక్టర్ రాజేంద్ర, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, రిమ్స్



రక్తదాతలకు రుణపడి ఉంటా..

మాది ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లె. నాకు గుండెవ్యాధి సమస్యలతో కడప నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరాను. జూలై 14 న హార్ట్ సర్జరీ చేశారు. ఆ సమయంలో నాకు మూడు ప్యాకెట్ల రక్తం అవసరమైంది. ఎవరో చెబితే హ్యాండ్స్ ఫర్ యు స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులను సంప్రదించగా వారు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన రక్తదాతలను జీవితాంతం గుర్తుంచుకుంటాను.

- గోపాల్‌రెడ్డి, తప్పెటవారిపల్లె, ఒంటిమిట్ట

కడప నగరంలో బ్లడ్ బ్యాంకులు..

- రిమ్స్ బ్లడ్ బ్యాంకు, సర్వజన ఆసుపత్రి, కడప
- రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు, అల్మాస్‌పేట, కడప
- ఫాతిమా మెడికల్ కళాశాల బ్లడ్‌బ్యాంకు, పులివెందుల రోడ్డు, కడప
- బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకు ఎన్‌జీఓ కాలనీ, కడప
- బృహద బ్లడ్‌బ్యాంకు, పాత మున్సిపల్ ఆఫీసు వద్ద, కడప.

రక్తదానం చేయడం ద్వారా మనం ఆరోగ్యంగా బతకడంతో పాటు ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తం అందించడం ద్వారా వారిని బతకనిచ్చే అవకాశం లభిస్తుంది. ఇంతటి బృహత్కర కార్యాన్ని నిర్వహించేందుకు, మనుషుల్లో మానవత్వం నిలిచే ఉందని చెప్పేందుకు ఎన్నో సంఘటనలు ఉన్నాయి. స్వచ్ఛందసేవా సంస్థలు సైతం రక్తదానం చేయడంలో పోటీపడి మరీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తకొరత లేని సమాజం కోసం శ్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం..

జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు రక్తదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.



వైవీయూ: రక్తం అన్నది కృత్రిమంగా తయారు కావడం లేదు.. ఎవరైనా దాతలు స్పందించి రక్తదానం చేస్తే తప్ప రక్తం అందుబాటులో ఉండటం లేదు. ప్రమాదాలు, ఆపరేషన్లు, ప్రసవాల సమయంలో రక్తం అవసరం ఎంతో ఉంటుంది. ఆ సమయంలో రక్తదాతలు, రక్తం కోసం పాకులాడటం మనందరికీ తెలిసిన సంఘటనే. అయితే మనలాంటి వారు రక్తదానం చేస్తేనే బ్లడ్‌బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉంటుందన్న విషయం మరిచిపోతున్నారు. దీంతో బ్లడ్‌బ్యాంకుల్లో సైతం రక్తనిల్వలు నిండుకుంటున్నాయి. దీనికి తోడు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో రక్తకొరతను నివారించేందుకు జిల్లా అధికార యంత్రాంగం స్వచ్ఛందసేవాంస్థల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు రక్తదాన ఆవశ్యకతను తెలియజెప్పేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

● జిల్లాలో రక్తకొరతలేని సమాజం కోసం బ్లడ్ టు లివ్, హ్యాండ్స్ ఫర్ యూ, ఖూన్‌కారిస్టా, జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసంస్థ, బోగా పార్వతమ్మ రక్తదాన సేవాసమితి తదితర సంస్థలు ఇప్పటికే వేలసంఖ్యలో యువతను రక్తదాతలుగా మార్చి ఆపద సమయాల్లో ఆదుకుంటున్నారు. వీరికి తోడు వివిధ బ్యాంకులు, ప్రభుత్వరంగసంస్థలుతో పాటు సామాజిక బాధ్యత కలిగిన పౌరులు సైతం ఆపద సమయంలో రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రక్తదానం ఎవరు చేయకూడదంటే..

- 18 సంవత్సరాలలోపు, 60 సంవత్సరాలు పైబడిన వారు
- శరీరబరువు 45 కేజీల కంటే తక్కువ ఉన్నవారు
- హెచ్ఐవీ, సిఫిలిస్, హైపటైటిస్ బి, హైపటైటిస్ సి, మలేరియా, క్యాన్సర్, హైబీపీ, క్షయ వాధ్యులు ఉన్నవారు.
- రక్తదానం చేసి 90 రోజులు దాటనివారు
- రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే తక్కువ ఉన్నవారు.

నేను సైతం



కడప నగరంలో రక్తదాన ఆవశ్యకత గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. తాజాగా రక్తదాన వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సైతం రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు.



రక్తదాన వారోత్సవాల్లో భాగంగా బుధవారం కడప నగరంలోని బృహద బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 31సార్లు రక్తదానం చేసిన పట్టుపోగుల సుబ్బారావును, 21 సార్లు రక్తదానం చేసిన సీకే దిన్నె మండలం ఏఎల్ కాలనీకి చెందిన మల్లికార్జున నాయక్‌లను పలువురు నాయకులు అభినందించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 20కి పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని వాటిల్లో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న బోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగిందని, దీంతోపాటు దూర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు ఇస్లాం, నూర్ బాషా, అజయ, గణేష్ పాల్గొన్నారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు పరచాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుకొనే విద్యార్థులు చాలా మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా ఎంత మంది విద్యార్థులు ఉంటారో అంత మందికి కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎస్‌యూఐ నాయకులు అరుణ్ కుమార్, చైతన్య లు పాల్గొన్నారు.

సమాజ సేవకులను తీర్చిదిద్దేది 'స్కౌట్స్ అండ్ గైడ్స్'

వైవీయూ : విద్యార్థిదశ నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చే గొప్ప సంస్థ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కౌట్స్ మాస్టర్స్, ఆర్ఎస్ఎల్ బేసిక్ శిక్షణ క్యాంపులో 6వ రోజు బుధవారం 'దీక్షా ప్రమాణస్వీకార' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ స్కౌట్ వ్యవస్థాపకుడు బెడెన్‌పావెల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన చూసిన మార్గంలో పయనించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్కౌట్స్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావడం గర్వించదగిన పరిణామమన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ సమాజం పట్ల బాధ్యతను తెలియజెప్పడంతో పాటు దేశసేవలో ముందుంటుందన్నారు. అనంతరం రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి డి. ప్రమీల, కోశాధికారి బి. శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, జాయింట్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, క్యాంపు లీడర్ జి. వెంకటేశ్వర్లు, అధికారులు లియో అంటోనీ, ఏఎస్‌టీసీ లక్ష్మీకర్, సూర్యప్రకాష్, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయాలి

పశుసంవర్ధ శాఖ జేడీకి పాడి రైతుల వినతి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పశువులకు ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులను అరికట్టేందుకు సకాలంలో టీకాలు వేయాలని ఒంగోలు, పుంగనూరు గోజాతి అభివృద్ధి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కడప మాజీ కార్పొరేటర్ పుత్తి వెంకటసుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. కడప జిల్లా పశుసంవర్ధ శాఖ(జేడీ కార్యాలయం) అధికారి శారదమ్మను బుధవారం కలిసి పాడి రైతుల సమస్యలపై చర్చించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ పశు వైద్యశాలల్లో తగినన్ని మందులు అందుబాటులో ఉండడంలేదని ఆరోపించారు. పశువులకు 15 శాతం మించి టీకాలు వేయలేదని, బీడ్రింగ్ యాక్ట్ ప్రచారం సెమన్ మొటిలిటీ చెక్ చేయాల్సిన అధికారులు ఆ విషయం పట్టించుకోవడం లేదన్నారు. ఖరీదైన ఒంగోలు జాతి గిత్తలకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. బైలాకు విరుద్ధంగా కమిటీ సభ్యులను నియమించారన్నారు.



పశు సంవర్ధశాఖ అధికారులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు, రైతులు

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

వైవీయూ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో కౌన్సిల్ ఫార్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ డిక్లమేషన్ (వక్తృత్వ) కాంపిటీషన్ ఉత్సాహంగా సాగింది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ సహ ఆచార్యులు డాక్టర్ జయంత్ కశ్యప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషపై పట్టుసాధిస్తే ఇతర సబ్జెక్టులను సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. బాగా మాట్లాడగలిగే సామర్థ్యం నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. చక్కటి అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్నల్ ఎ. శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, హెచ్ఎం రహమతుల్లా, ఆక్టివిటీ ఇన్‌చార్జి మహబూబున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు కోరారు. బుధవారం వైవీయూలోని వసతిగృహాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్ బిల్లులు వచ్చినంతగా, భోజనం పెట్టడంలో నాణ్యత చూపడం లేదన్నారు. గత 20 రోజులుగా మెనూ అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సిద్దిక్, నగర అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

ప్రసాదరావుకు డాక్టరేట్



ప్రసాదరావు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయం ఉద్యోగి బి. ప్రసాదరావుకు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఈయన ఎస్వీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ – ఇన్ఫర్మేషన్ సైన్స్, రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ ఎం. ప్రశాంతకుమారి పర్యవేక్షణలో 'జవహర్ నవోదయ విద్యాలయ లైబ్రరీస్ ఆఫ్ రాయలసీమ' అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రకటించారు.

జాషువాకు ఘన నివాళి

కడప కల్చరల్ : పేదరికం, అంటరాని తనాలను మహాకవి గుర్రం జాషువా తీవ్రంగా నిరసించారని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో బుధవారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జాషువా 53వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల, సాహితీవేత్త డాక్టర్ పాలెం వేణుగోపాల్, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ జాషువా రచనలు, మూఢాచారాలపై ఆయన చేసిన తిరుగుబాటు తదితర అంశాల గురించి వివరించారు. జీవకళ సత్యనారాయణ, దేవరశెట్టి గంగయ్య, పట్నం సుబ్బరాయుడులు జాషువా నాటకంలోని కాటిసీను పద్యాలను ఆలపించారు.

అంతర్గత రహదారులను వినియోగంలోకి తేవాలి



మెప్మా అధికారులతో మాట్లాడుతున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో అంతర్గత రహదారులు త్వరితగతిన వినియోగంలోకి వచ్చేలా చూడాలని మెప్మా అధికారులను వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి కోరారు. గతంలో అప్పటి వీసీ ఆచార్య చింతా సుధాకర్ విజ్ఞాపన మేరకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గెస్ట్ హౌస్ నుంచి 21వ శతాబ్ది గురుకులం వరకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహకారంతో పనులు సాగాయి. అవి పూర్తి కావడానికి రోలింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేసి విద్యార్థులకు ప్రయోజనకరంగా మార్చాలని మెప్మా జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ మధుసూదన్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మల్లేశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్యలను కోరారు. అంతర్గత రహదారుల ద్వారా విద్యార్థులకు రక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని బీసీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, వసతులు కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు కోరారు. దీనిపై జిల్లా వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి భరత్ కుమార్ రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించడం లేదన్నారు. సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు లేవని, కాస్మొటిక్ ఛార్జీలు ఏడు నెలలుగా అందించడం లేదన్నారు. అద్దె భవనాలలో ఉన్న బీసీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలను నిర్మించాలన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత, ప్రజా సంఘాల నేతలు

కడప రూరల్ : ఇటీవల దళిత విద్యార్థి నవదీప్‌ను గాయపరచిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెహికల్ చెకింగ్‌లో భాగంగా పోలీసులు విద్యార్థి నవదీప్‌ను గాయపరచడం దారుణమని అన్నారు. ఈ అంశంను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో జయచంద్ర,రాజు, చిన్నయ్య, బీసీ గంగుల, జీవీ రమణ, ఏలియా, రాజశేఖర్, పీ మల్లిఖార్జున, గద్దం గుర్రప్ప, మాసాపేట శివ, జీ మల్లేష్, రాజశేఖర్, కైపు రామాంజనేయులు పాల్గొన్నారు.

కడప రాయుని సన్నిధిలో జేసీ

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ బుధవారం దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. జేసీగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆలయానికి వెళ్లిన ఆమెకు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఆమె స్వామి, అమ్మవార్ల మూలమూర్తులను దర్శించుకున్నారు.

కంటి, వైద్య పరీక్షలు

కడప రూరల్ : సాక్షి యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కడప సాక్షి యూనిట్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి కంటి పరీక్షలను నిర్వహించారు. కడప నగరం రాజీవ్‌మార్గ్‌లోగల సురేష్ కంటి ఆస్పత్రి వైద్యులు, ప్రముఖ ఫ్యాకో సర్జన్ ఎ.సురేష్‌బాబు కంప్యూటర్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి కంటి అద్దాలను వాడాలని సూచించారు. అంతకుముందు కడప ఏడురోడ్ల వద్దగల రమేష్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. అనంతరం సాక్షి కడప యూనిట్ మేనేజర్ సి.హరినాథరెడ్డి, బ్యూరో ఇన్‌ఛార్జి ఎం.బాలకృష్ణారెడ్డి, యాడ్స్ రీజినల్ మేనేజర్ సుబ్బారెడ్డిలు డాక్టర్ సురేష్‌బాబును శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సాక్షి కార్యాలయలలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.



సాక్షి కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు (ఇన్‌సెట్) డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం